# అభివృద్ధికి మద్దతుగా నిలువండి

- అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్ గెలవాలి
- సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని వర్గాలకు సమన్యాయం
- బీఆర్ఎస్ అభ్యర్థుల ఆత్మీయ సమావేశాలకు విశేష ఆదరణ


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, చిత్రంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, తదితరులు

సిటీబ్యూరో, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థుల జైత్రయాత్ర జోరుగా సాగుతున్నది. నోటిఫికేషన్ కంటే ముందుగానే నియోజకవర్గాన్ని చుట్టేసిన నేతలు..రెండో విడత ప్రచారంలో సరైన వ్యూహాలతో ముందుకెళుతున్నారు. అభ్యర్థులు సైతం ఒకవైపు పాదయాత్రలు, మరోవైపు అన్ని వర్గాల మద్దతును కూడగట్టేందుకు ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు మీకు అన్ని విధాలుగా అండగా ఉన్న తమకు నవంబర్ 30వ తేదీన జరిగే ఎన్నికలలో మద్దతుగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు. ఇందులో భాగంగానే శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో గుజరాతి, జైన్, రాజస్తానీ, బెంగాళి వర్గాలకు చెందిన ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇదే తరహాలో గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ..గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం ఉందని, అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నదన్నారు. మరి ఇటువంటి ప్రభుత్వాన్ని ఆదరించాలని బీఆర్ఎస్ అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇంటింటీ ప్రచారం, పాదయాత్రలు ఒకవైపు మరోవైపు కలిసివచ్చే నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తూ నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నారు. నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాలతో క్యాడర్‌లో నూతనోత్తేజాన్ని నింపుతూ అందరినీ ఒక్క తాటిపైకి తీసుకువచ్చి అభ్యర్థుల గెలుపునకు బాటలు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పదేండ్ల అభివృద్ధి, ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో ప్రచార అస్త్రంగా కాలనీలు, బస్తీలు కలియతిరుగుతూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు 65 ఏండ్లు పాలించిన అభివృద్ధి జరగలేదని, గడిచిన పదేండ్లలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం వందేండ్ల అభివృద్ధికి బాటలు వేసిందంటూ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీల కంటే ముందున్న బీఆర్ఎస్ ప్రత్యర్థి పార్టీల డిపాజిట్లను గల్లంతు చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పావులు కదుపుతున్నారు. కలిసి వచ్చే ఇతర పార్టీల నేతలకు గులాబీ కండువాలు కప్పుతూ నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతూ ప్రతిపక్ష పార్టీలకు ముచ్చేమటలు పట్టిస్తున్నారు. దాదాపు రెండు నెలల గులాబీ శ్రేణుల ప్రచార శైలితో బీఆర్ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ డా.అనితారెడ్డి

# చివరి శ్వాస వరకు సేవ చేస్తా

- 30 రోజులు నాకోసం పనిచేయండి
- మహేశ్వరంలో ఎన్నికల పార్టీ కార్యాలయం ప్రారంభించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబర్ 28: మహేశ్వరం నియోజకవర్గం నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తుది శ్వాస ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తానని విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బాబాయ్య ఫంక్షన్ హాలులో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు మీర్‌పేటలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు మరోసారి సేవ చేయడానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా అవకాశం కల్పించారన్నారు. 30 రోజులు నాకోసం పనిచేస్తే శ్వాస ఉన్నంత వరకు ప్రజల కోసం పనిచేస్తానని తెలిపారు. సబితమ్మ వెనుక ఉన్న బలాన్ని చూసి ఢిల్లీలో చర్చలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతుబంధు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే మెట్రో రైలు పరుగులు పెడుతుందని, మెడికల్ కళాశాలలు ఏర్పాటు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీత అంద్యానాయక్, కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజు నాయక్, పాండు యాదవ్, కూన యాదయ్య, సుధీర్ గౌడ్, కర్నాకర్ రెడ్డి, అంజయ్య ముదిరాజ్, లచ్చునాయక్, సమీర్, యాదగిరి, చంద్రయ్య ఉన్నారు.

## టీ హబ్‌ను సందర్శించిన ప్రాట్ అండ్ విట్నీ

### ఏరోస్పేస్ టెక్నాలజీపై కలిసి పనిచేసేందుకు ఆసక్తి



టీ హబ్‌ను సందర్శించిన ప్రాట్ అండ్ విట్నీ ఏవియేషన్ కంపెనీ ప్రతినిధులు

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): అమెరికాకు చెందిన ఏరోస్పేస్ ఉత్పత్తుల తయారీ కంపెనీ ప్రాట్ అండ్ విట్నీ ప్రతినిధుల బృందం శనివారం టీ హబ్‌ను సందర్శించారు. టీ హబ్ నిర్వహిస్తున్న కార్పొరేట్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ప్రాట్ అండ్ విట్నీ ప్రతినిధులు టీ హబ్‌లోని స్టార్టప్ కార్యకలాపాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ప్రధానంగా ఏరోస్పేస్ టెక్నాలజీలో కలిసి పనిచేసేందుకు ఉన్న అవకాశాలపై టీ హబ్ ప్రతినిధులతో వారు చర్చించారు. ఇప్పటికే ఏరోస్పేస్ రంగంలో టీ హబ్ ప్రోత్సాహంతో మంచి విజయాలు సాధించిన స్కైరూట్, ధృవ ఏరోస్పేస్ కంపెనీల కార్యకలాపాలపైనా చర్చించామని టీ హబ్ ప్రతినిధులు తెలిపారు. ఏరోస్పేస్ రంగానికి హైదరాబాద్‌లో ఉన్న అవకాశాలపైనా వారు చర్చించారు.

## నవంబర్ 7 నుంచి హై లైఫ్ ప్రదర్శన




బంజారాహిల్స్, అక్టోబర్ 28: దీపావళితో పాటు పండుగల సీజన్‌ను పురస్కరించుకుని నగరవాసుల మనసుకు నచ్చే డిజైనర్ వస్త్రాలు, ఆభరణాలు, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులతో నవంబర్ 7 నుంచి 9 వరకు మాదాపూర్‌లోని నోవాటెల్‌లో 'హైలైఫ్' ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. బంజారాహిల్స్‌లోని మార్క్స్ మీడియా సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన కర్టెనరైజర్ కార్యక్రమంలో టాలీవుడ్ హీరోయిన్ లహరితో పాటు మోడల్స్ చేతుల మీదుగా బ్రోచర్లను ఆవిష్కరించారు. విభిన్నమైన వస్త్రాలను ధరించి సందడి చేశారు.

## ఆరోగ్యకరమైన జీవన శైలితో వంధ్యత్వానికి చెక్

### ఐవీఎఫ్ ద్వారా జన్మించిన శిశువుల తల్లిదండ్రులతో వేడుకలు



జూబ్లీహిల్స్, అక్టోబర్ 28: వంధ్యత్వం సాధారణ అనారోగ్య సమస్యల వంటిదేనని.. ఆరోగ్యకరమైన జీవన శైలితో వంధ్యత్వానికి చెక్ పెట్టవచ్చని ఒయాసిస్ ఫెర్టిలిటీ కో ఫౌండర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాజీరావు పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని ఒయాసిస్ ఫెర్టిలిటీలో ఐవీఎఫ్ చికిత్స ద్వారా జన్మించిన శిశువుల తల్లిదండ్రులతో శనివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డను కనడం జీవితంలో లభించే గొప్ప వరమన్నారు. జీవన శైలిలో మార్పులు, మాతృత్వాన్ని ఆలస్యం చేయడం, వ్యాయామం లేకపోవడం, విచ్చలవిడిగా జంక్ ఫుడ్‌లు తినడం, పర్యావరణ కారణాలతో భారతదేశంలో వంధ్యత్వం క్రమంగా పెరుగుతుందన్నారు. అపోహలను పక్కనపెట్టి అధునాతన సాంకేతికతతో పిల్లలను కనాలనే కలలను సాకారం చేసుకోవాలన్నారు. ఒయాసిస్ దేశ వ్యాప్తంగా సుమారు దశాబ్దన్నర కాలంగా 30 కేంద్రాలలో సేవలందిస్తూ పునరుత్పత్తి సంరక్షణకు సరికొత్త నిర్వచనం ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఒయాసిస్ క్లినికల్ ఎంబ్రియాలజిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య, కన్సల్టెంట్ డాక్టర్ ప్రాచీ ఎస్.కులకర్ణి, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్‌లు డాక్టర్ అఖిల, డాక్టర్ ఐశ్వరీ దుర్గే పాల్గొన్నారు.

## హోరాహోరీగా సీబీఎస్ఈ టీటీ టోర్నీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సీబీఎస్ఈ టేబుల్ టెన్నిస్ టోర్నీలో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. టోర్నీ రెండో రోజైన శనివారం వేర్వేరు విభాగాల్లో ప్లేయర్లు తమదైన ప్రతిభతో సత్తా చాటారు. బాలుర అండర్-14 ఫైనల్లో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ 3-1తో చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్‌పై విజయం సాధించింది. బాలికల విభాగంలో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ 3-2తో మాథ్యూస్‌పై గెలిచింది. బాలుర అండర్-17 ఫైనల్లో సంస్కృతి కొండాపూర్ స్కూల్ 3-0తో చిరెక్ స్కూల్‌ను ఓడించింది.

## చంద్రయాన్ టు చందమామ

### పీపుల్స్ ప్లాజాలో ఆకట్టుకుంటున్న ఉత్సవ్ మేళా


విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ మోడల్

ఖైరతాబాద్, అక్టోబర్ 28: భారత అంతరిక్ష సంస్థ ఇస్రో చేపట్టిన చంద్రయాన్ మిషన్ సక్సెస్ నూతన చరిత్రను సృష్టించిన విషయం తెలిసిందే. చంద్రయాన్ ప్రయోగం, విక్రమ్ ల్యాండర్ పనితీరు, చంద్ర మండలంలో ఏలియన్స్ సంచారం లాంటి మోడల్స్‌ను నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఏర్పాటు చేసిన కలర్స్ ఉత్సవ్ మేళాలో ప్రదర్శించారు. సుమారు 50 అడుగుల ఎత్తైన చంద్రయాన్ రాకెట్ మోడల్ ప్రత్యేక అకర్షణగా నిలువగా, కదలియాడే విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ చూపరులను మరింత ఉత్సాహపరుస్తుంది. చంద్ర మండలంపై 3డీ ఎఫెక్ట్స్‌తో రూపొందించిన ఏలియన్స్ నమూనా చిత్రాలు ప్రత్యేకంగా ఉంటాయి. వీటితో పాటు చిన్నారులకు ఆటవిడుపుగా ఉండే అమ్యూజ్‌మెంట్స్ రైడ్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటున్నదని నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ తెలిపారు.

## జిమ్నాస్టిక్స్‌లో వైష్ణవి పసిడి జోరు



విజయనగర్ కాలనీ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జరిగిన ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ ఇన్విటేషనల్ టోర్నీలో వైష్ణవి వ్యాస్ మూడు పసిడి పతకాలతో సత్తా చాటింది. ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, టేబుల్ వాల్ట్, రింగ్స్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన కొనసాగిస్తూ పతకాలు ఒడిసిపట్టుకుంది. సెయింట్ అల్బర్ట్ హైస్కూల్‌కు చెందిన తరుణ్‌లాల్ రెండు స్వర్ణాలు సొంతం చేసుకున్నాడు. పోటీల ముగింపు కార్యక్రమంలో జాతీయ మాజీ ప్లేయర్ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు. -హైదరాబాద్, ఆట ప్రతినిధి

## ఊబకాయానికి మధుమేహం తోడైతే తీవ్ర అనారోగ్యం

### ఏఐజీ సీఎండీ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి




సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): ఊబకాయం అనేది అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని, దీనికి మధుమేహం తోడైతే ఆరోగ్య పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం లేకపోలేదని ఏఐజీ సీఎండీ డా.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. నగరంలో శనివారం నిర్వహించిన ఏషియన్ ఒబేసిటి వాక్ అనంతరం, ఆయన మాట్లాడుతూ ఊబకాయ రోగుల్లో కార్డియోవాస్క్యులర్, కాలేయ సంబంధిత వ్యాధులు, స్లీప్ ఆప్నియా, కిడ్నీ సంబంధిత తదితర వ్యాధులను సర్వసాధారణంగా చూస్తుంటామన్నారు. అయితే, ఊబకాయంతో బాధపడుతున్న రోగులకు మధుమేహం వ్యాధి తోడైతే ఉన్న ఆరోగ్య పరిస్థితులు మరింత తీవ్రంగా మారడమే కాకుండా, ఇతర అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించారు. మన దేశంలో 30మిలియన్ల మంది ప్రజలు ఈ అంతర్గత రుగ్మతలతో బాధపడుతున్నట్లు వెల్లడించారు. ఊబకాయం, మధుమేహం వ్యాధుల వల్ల తలెత్తే మల్టీ డిసిప్లినరీ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనే ప్రయత్నంలో భాగంగా ఏఐజీ మొదటి సారిగా ఈ రెండు వ్యాధులపై సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డా.రాకేష్ కలపల, యూఎస్ఏకు చెందిన వైద్య నిపుణులు డా.బర్హామ్ అబుదయ్యా, డా. రెజినాల్డ్ బెల్, డా.విన్సెంట్ హబర్టీ పాల్గొన్నారు.